# రుద్ధకంఠం

అత్తవారి వూళ్లో కొత్తగా వుద్యోగమైనప్పుడు చాలా సంతోషించాడు మృత్యుంజయుడు. ఎందుకంటే అతనికి జ్ఞానంరాని రోజుల్లోనే తల్లితండ్రులు ఎప్పుడో మరణించారు. ఏదోగాలి తిని బతికినట్టు బతికాడు అంతవరకు. తర్వాత చదువుకునే రోజుల్లోనే అతని మేనమామలూ, తక్కినవాళ్ళూ పిల్లల్నిస్తామనీ, పెళ్ళిచేసుకోమనీ బలవంతం చేశారు. కాని అతను ఉద్యోగమైతే గాని చేసుకోదలచలేదు. తర్వాత పనిలో చేరాక ఎవరినో నచ్చిన సంబంధం వొప్పుకుని పెళ్ళి చేసుకున్నాడు. మేనరికం అంగీకరించలేదు. ఎందుకో వాళ్ళపయిన అతనికి అణగారిన కోపం వుంది. అతని జీవితం వెనక్కి తడిమి చూసుకుంటే అయోమయంగానూ, శూన్యంగాను వుండేది, అల్లాంటప్పుడు అతన్ని గమనించిన వాళ్ళుగాని, అతని అస్తిత్వాన్ని గుర్తెరిగిన వాళ్ళు గాని కాలేదా కావలసినచుట్టాలు! అందుకనే వాళ్ళపైన కోపం!

మృత్యుంజయుడు రాజమండ్రిలో పనిలోచేరి అత్తవారింట్లోనే వున్నాడు. మొదటి రోజుల్లో వేరేయిల్లు చూసుకొని పోదామనుకున్నా మామగారు వొద్దన్నారు, అతనూ అంగీకరించాడు.

అతని జీవితమంతా వొంటరిగా గడిచింది ఇంతవరకూ. పదిమందిలోనూ. కావలసిన వాళ్ళలోవుండి ఎరగడు. అయినా మామగారింట్లో ఎవరూ ఎక్కువజనం లేరు. బోలెడు ఆస్తి, పెద్దకొంపా వున్నాయి. అత్తగారుకూడా మర్యాద, అభిమానం చూపుతుంది. సంసారజీవితపు మొదటి పుటల్ని తిరగవేసే రోజుల్లో భార్యకు ఎక్కువగా శ్రమనియ్యకుండా సహాయం కూడా వుంటుంది. తనకా? ఇన్నాళ్లు అనుభవించిన అంతులేని ఒంటరితనం, జీవితంలోని సంతోష రాహిత్యం. విసుపూ అన్నీ పోతాయి. అందుకనే వొప్పుకున్నాడు.

రెండునెల్ల జీవితం చాలా సంతోషంగానూ, ఊహాతీతంగానూ గడిచింది. తర్వాత ఇంట్లో ఏదో మార్పువొచ్చింది? అతని భార్యచేత వేరే వొంట మాన్పించారు. అతన్నీ వాళ్ళింట్లోనే వాళ్ళడబ్బుతో తినమనేవారు. అతనికి డబ్బు ఇంటికోసం ఖర్చుపెట్టే అవకాశం వుండేదికాదు. ఏదో తాను అమ్ముడు పోయినట్టుగా, ఏదో మోసపోతున్నట్టు, ఎవరో ద్రోహం చేస్తున్నట్టు అనుకున్నాడు.

అతని వుద్దేశం ప్రకారం అతను ప్రేమిస్తున్నట్టు ఎవరూ వాళ్ల భార్యల్ని ప్రేమించివుండరు. అతని జీవితంలో మరే స్త్రీ పరిచయం ఎరుగడు. అట్లా వుండకుండా వున్నవాళ్లు నాగరికతకి వేరుపురుగులనీ, వాళ్ళ విద్యాధిక్యతని అగౌరవపర్చిన వారనీ అతని నమ్మకం! మానవుడికి ఒకటే బ్రతుకైనట్టు, ప్రేమకుకూడా ఒకరిమీదే వుండాలనీ. ఆ కోరుకొన్న ప్రేమ తియ్యనిదై వుండాలనీ అతని ఆశయం.

కాని ఇక్కడి మార్పు అతనికి నచ్చలేదు. ఒకరోజు రాత్రి అన్నాడు.

"మనకి వేరేయిల్లు చూస్తాను ఇక్కడ ఏదో బానిసత్వంలో వున్నట్టుంది. స్వతంత్రంగా బతుకుదాం"అని.

"మీకు వొట్టిభయం ఎక్కువంతే. వాళ్ళకి మాత్రం ఎవరున్నారు, మనంతప్ప? ఐనా మీకొచ్చిన కష్టమేమిటిప్పుడు?" అందిభార్య. ఆవిడ పేరు సుశీల.

"అదికాదు, సుశీ: నామాటని ఎందుకు కాదనాలి. పోనీ ఇక్కడైనా స్వతంత్రంగా వుందాం; నాకు అభ్యంతరం లేదు." అన్నాడు మృత్యుంజయుడు మళ్ళా ఒకమెట్టు కిందకుదిగి.

"సరేలెండి. ఆలోచిద్దాం" అని ముగించింది సుశీల.

అతని కెందుకో సంభాషణ సంతృప్తికరంగా లేదు. ఆవిడకీ తెల్సు అతనిప్రేమ ఎంత గాఢమైందో, ఎందుకు తన అభిప్రాయాలతో ఏకీభవించకూడదు!

మర్నాడు భోజనాలదగ్గర అత్తగారే అంది "అతనికి మనతో కల్సివుండడం ఇష్టంలేదులా వుంది. రాత్రినించి వేరేవంట" అని.

"అవునుటోయ్" అన్నాడు మామగారు.

"అవునండి. దేవుడిచ్చిన రెక్కలున్నంతకాలం... .... ..." అసంపూర్తిగా ముగించాడు అతను. మనసులో మాత్రం కోపం రగుల్తాంది. భార్య ఎందుకుచెప్పాలి వాళ్ళతో? ఏం? వాళ్ల అనుజ్ఞలేకుండ వేరే వుండకూడదా? అందుకే దూరంగావుంటే మంచిదనుకున్నాడు. కాని భార్య ఏదో కారణం చెబుతుంది.

రాత్రి వాళ్లు :-

"పడకింటి గదిలో సంగతులు పైకి బ్రాడ్‌కాస్ట్ కావాలన్నమాట"

"ఏం? అంది భార్య.

"మీవాళ్ల అనుజ్ఞలేందే మనం వేరే వుండడానికి అర్హత లేదన్నమాట! నామాటకంటె వాళ్ల మాట మీద విలువెక్కువ నీకు అవునా?" అన్నాడు.

"కాదండీ! వేరేవొండుకుంటే వాళ్ళకి తెలీదూ" అంది భార్య.

"ఆ! భయమే మానసిక బానిసత్వం! అందుకే వేరే ఇంటికి పోదామని నాగోల!" అని అన్నాడు తిరిగి.

"ఇంకేవూరైనా బదిలీ అయితే తప్పుతుందా? అయినా, ఐనవూళ్లో వేరేయింటిఅద్దీ. మనజీతం. కర్చూ అవీ ఆలోచించండి" అంది.

అతను వూరుకున్నాడు. సమయానికి తగిన పొడి వేసింది.

మళ్లీ దీపావళి పండుగ ముందర-మూడు రోజులుండనగా:

"మనం పండక్కి వాళ్లింట్లో మూడురోజులు భోజనం చెయ్యాలట"

"ఏం? మనం అన్నం తినడంలే! అక్కడేమన్నా బంగార మొలుకుతుందా? ఆమాట మళ్లీ అనకు" అన్నాడు మృత్యుంజయుడు.

మర్నాడు అత్తగారు అంది. "ఏమోయ్! పండక్కు మీరిద్దరూ ఇక్కడికి రావాలి భోజనానికి" అని.

"ఆ ఎందుకండి పనిలేక. కావలిస్తే మీ అమ్మాయిని అక్కడ తినమనండి, నా అభ్యంతరంలేదు" అన్నాడు.

"మరి నీమాటో?"

"ఏదో హోటల్లో తింటాను"

"పండగపూట హోటలేమిటోయ్"

"ఆయనికి అలవాటేనే" అందిభార్య. అతను అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

గోదావరి గట్టుకుచేరి సిమెంట్ అరుగుమీద కూచునేటప్పటికి చాలా కష్టమయింది. ఏదో ఆలోచనలోవున్న మూలాన రెండుసార్లు కారుకు అడ్డువెళ్లాడు, ఒకసారి జట్కావాడు బండిబండని అరవాల్సొచ్చింది; రెండుమూడు కంకరరాళ్ళు కాల్లో గుచ్చుకున్నాయి చెప్పులున్నా - అక్కడికి చేరేలోపల.

ఎవరో జనం, దంపతులూ. దేవాలయాలికి పోయే స్త్రీలు వాళ్ళనిచూసి ఆనందించడానికి గట్టునచేరే విద్యార్థులూ, రిక్షావాళ్లు, లాంచీల దగ్గరచేరి వాళ్లుచేసే గొడవలేమీ తనకి పట్టనట్టున్నాడు.

దూరంగా ధవళేశ్వరం, ఆనకట్టు దగ్గర్నించి 'ఆర్థర్ కాటన్' బొబ్బర్లంకనించి తిరిగొచ్చే "డరోతీ", కొవ్వూరు లాంచీ. బ్రిడ్జిమీదించి ఏలూరు కోచ్ అన్నీ ఒక్కసారిగా అరచినా అతని దృష్టిని ఆకర్షించలేకపోయాయి. మార్కండేయుని గుడిలో గంటల మ్రోతలు గోదావరి గాలిలో కలిసిపోతున్నాయి, కాని అతనికేంపట్టలేదు.

"అవును? ఆడవాళ్ళెప్పుడూ ఇంతే! అభినయం ఎక్కువ! అసలు ప్రేమలుండవు! ఈ ప్రేమకథలు రాసే రచయితల్నీ, స్త్రీని మహా ప్రేమమూర్తిగా వర్ణించిన మహాకవుల్నీ, స్త్రీనే దేవతగా వరించి, ఆరాధించే చిత్రవీరున్నీ, అందర్నీ కట్టకట్టి, ఏ ద్వీపంలోనో పెట్టి దానిమీద ఓ యాటంబాంబు వేస్తే బాగుణ్ణు.

"ఆయనకి అలవాటేనట! అందులో ఉంది స్త్రీత్వంమంతా, స్త్రీల కాఠిన్యతంతా, వాళ్ళప్రేమ, గొప్పతనం అదే.

"నిజంగా నామీద ప్రేమవుంటే ఆమాత్రం తిండిని త్యాగం చెయ్యకూడదూ? ఏం? మా యింట్లో మాత్రం ఏంలోటు? పండగ ఖర్చు ఏభై రూపాయలు బడ్జట్ వేసివుంచానే! అయినాస్త్రీలకి ప్రేమనేది వుంటే ఇంట్లో భర్తని కాదని తమసుఖం, సంతోషం, అవే చూసుకుంటారా?

అవును నేననుకున్నదే నిజం! ఎంత ప్రేమగాథ రాసిన గొప్ప రచయితైనా? వర్ణించే మహాకవైనా, చిత్రించే చిత్రవీరుడైనా జీవితంలో నిజాల్ని స్త్రీల ఈ నిజస్వరూపాన్ని ఒకసారి కాకపోతే మరోసారైనా రుచిచూసుంటారు. కాని వాటిని కాగితంమీద పెట్టడానికి గుండెవుండదు. వాళ్ళ ఊహాలోకాల విహారానికి అంతరాయం కల్గుతుంది. కొంతమందికి ఇంట్లో అన్నం దొరక్కపోవచ్చును మరుసటిపూటనించి. అందుకనే సత్యాన్ని దాచి, స్త్రీయే ప్రేమ మూర్తి అనుకుని, లోకాన్ని భ్రమింపజేసి సంతోషిస్తారు పైపైన.

'నన్నడుగు! నిజమైన ప్రేమమూర్తి మగవాడే. ప్రేమకోసం ప్రాణాన్ని త్యాగంచేసినా, ప్రాణాన్ని నిలుపుకున్నా మగవాడే అందుకు సమర్థుడు. స్త్రీలదంతా అభినయం. అనునయమూను!

ఏవో రకరకాల ఆలోచనలు అతని మెదడులో కదిలాయి. కొంతసేపటికి చీకటిపడింది. గోదావరిగట్టున జనం పల్చబడ్డారు. మద్రాస్‌మెయిల్ అతన్ని, ఆలోచనల్లోంచి మేలుకొలిపింది. ఇంటికి బయలుదేరాడు.

ఆక్షణంలో అతనికిజీవితంమీద చెప్పలేనంత అసహ్యం, ఏవగింపుకలిగింది. 'ఎందుకొచ్చిన బతుకు' అనుకున్నాడు పోతో.

బజారుప్రేమలు అతనికితెల్సు. అందులోని కుళ్ళు క్షుద్రత్వంకూడా తెల్సు. అందుకనే తను తన భార్యనొక్కత్తెనే అంతగా ప్రేమించగలుగుతున్నాడు. ఐతే తనభార్య ఎందుకు అలా వుంటుంది? అనుభవంలేకా? ప్రేమలేకా? అతను దేన్నీనమ్మలేదు. ప్రేమని తెల్సుకునేందుకు అనుభవం ఎందుకు? ప్రేమ లేదనుకోడానికికూడా తగిన కారణాలులేవు. తల్లిదండ్రుల్ని ప్రేమించడం తెల్సినపుడు భర్తనేనా ప్రేమించడం తెలియంది? అదీకాదు.

చివరకి అది స్త్రీల స్వభావమని నిర్ధారణకివొచ్చాడు. అందుకనేగావును తనుచూసిన చాలామంది స్త్రీల జీవితాలు సంతోషరహితంగానూ, దుర్భరంగానూ వుండి వుంటాయి. శవాల్లాగా, నీడల్లాగా, కలలోని వ్యక్తుల్లాగా మెదులుతుంటారు. సజీవశక్తి కనపడదు. అంతకీకాకపోతే ఏవో చేతబొమ్మలకి ప్రాణం పోసినట్టు మెలగుతారు.

ఇల్లుచేరేడు. ఇంట్లోనివాళ్ళెవరూ తనరాకని గమనించినట్టు తోచలేదతనికి. తిన్నగా పడకగదిలోకి వెళ్ళిపడుకున్నాడు.

రాత్రి తొమ్మిదింటికి సుశీల వొచ్చింది.

"మీకోసం జామునించి చూస్తున్నాను. అన్నానికి లేవండి" అంది.

"నామాట జ్ఞాపకముందన్నమాట" అన్నాడు.

"ఇది మరీబాగుంది. మీకోసం ఎంతవరకూ కనిపెట్టుకోవాలి, భోజనానికి."

"పాపం. చాలాశ్రమపడివుంటావు. ఇందాకే చెబుదామనుకున్నాను,– నువ్వు కనబడలేదు. నాకు కేకవేసేందుకు ఓపికలేకపోయింది. నువ్వువెళ్ళి అన్నంతిను నాకు ఆకలిలేదు."

"మీరు తినరేమిటి. అందంగానేవుంది." మళ్ళీ రెట్టించింది.

"నీతో ఎప్పుడన్నా అబద్ధమాడానా?" అన్నాడు. 'ఇదివరకు' అనిమనస్సులో అనుకున్నాడు. ఇప్పుడు ఆడిందిమాత్రం అబద్ధమే: భార్య ప్రేమని పరిక్షించాలని అతనిఉద్దేశం.

కాని సుశీల సంభాషణ అక్కడితోఆపి భోజనానికివెళ్లింది.

అదుగో! మళ్ళీ తెలిసిపోయింది. ఏదో మాటవరసకి అడిగిందికాని, తనుఅన్నం తినకపోతే మాత్రం, దానికేం? కడుపునిండాతిని రాయిలా కూచుంటుంది. ఆవిడకి తనమీద ప్రేమలేదని మళ్ళీఇంకోసారి బయటపడింది. నిజంగా, ప్రేమవుండే భార్యఅయితే, భర్తఅన్నం తినకుండా విస్తరిముందర కూచుంటుందా? ఎవరన్నా బలవంతంచేస్తే, కూచున్నా అన్నంతినగలదా? అనుకున్నాడు.

రాత్రి వాళ్ళ వాళ్ళేం మాట్లాడుకోలేదు. వయస్సుమళ్ళిన వృద్ధదంపతుల్లా అసంబంధీకులై నట్టు గడిపారు. రెండురోజులలా గడిచింది.

దీపావళినాడు పొద్దున సుశీల కాఫీతీసుకవచ్చింది. అతను మొహమన్నా కడుక్కోకుండా మందంగ కూచుని ఉన్నాడు. టేబుల్‌మీద కాఫీ, అతనికెదురుగావుంది.

"ఎవరికి?" అన్నాడు.

"మీకే!" అంది.

"అన్నట్టు నువ్వీవేళకూడా మీవాళ్ళింట్లోనే భోజనం, మరికాఫీ ఎందుకునాకు?"

"ఏం? కాఫీ కూడాతాగకూడదా? వాళ్ళింత అంటరానివాళ్ళయ్యారా?

"అదికాదు, నేను ఈ మూడురోజులు హోటల్లోనే భోజనం చేస్తానన్నానుగా! అయినా నాకిపుడు తాగాలని లేదు."

ఆవిడ ఒకనిమిషం నిశ్శబ్దంగావుంది. అతనులేచి మొహంకడుక్కుందుకు వెళ్ళబోయాడు.

"కాఫీతాగకపోతే నామీదవొట్టు. నేనుకూడా అన్నంతినను" అంది.

అతనుఆగి భార్యమొహం ఒకక్షణం చూశాడు. 'నిజంగా ఆమాటలు హృదయంలోంచి వస్తున్నాయా?" అని.

అతను తిరిగి వొచ్చేదాకా అక్కడేకూచుంది. అతనికి ఆమె చర్యలన్నీ ఏదో పైపైనటన కింద కనబడ్డాయి. అతను దుస్తులుమార్చుకొని బయల్దేరబోయాడు.

సుశీలఅడ్డువెళ్ళి, "అంతేనన్నమాట" అంది.

"నువ్వా అంతేకదా!"

"ఎవరిమీదా ఆకోపం?"

బ్రహ్మదేవుడి మీద, నాకు ఒకరిమీద కోపంఎందుకు? నీనియమాన్ని నువ్వు నెరవేర్చు కుంటే నా నియమాన్ని నేను నెరవేర్చుకుంటాను."

ఆమె మాట్లాడలేదు.

"అయినా ఈవేళతో ఆఖరేగా" అన్నాడు మృత్యుంజయుడు. 'మావాళ్ళింట్లో భోజనం' అనుకుని ఆవిడ పూర్తిచేసుకుంది. 'నాపని' అని అతననుకున్నాడు లోపల. అప్రయత్నంగా లోపలిభావాల్ని వెడలగక్కినందుకు భయపడ్డాడు, కాని సుశీల వేరేఅర్థం తీసుకున్నమూలాన వూరుకుంది.

"పోనీలెండి. రేపటినించి మరల మామూలుగా వుందాం." అందిముగిస్తూ! ఈవేళొక్క రోజూ అంతఓపిక పట్టరా? అనుకుందిలోపల.

"అవును ఈవేళకిమాత్రం భోజనం మానదు ఏమైనా; ఎంత తిరస్కారం;" అనుకున్నాడు; అతను వెడుతూ

సుశీల కొన్ని క్షణాలు అలానే నిల్చుని మళ్లీ తనపనిలో నిమగ్నమైంది.

అతనికి వొంట్లో నిప్పు రగుల్తోంది. బజారంతా పిచ్చిగా తిరిగాడు. నీరసంవొస్తే వరదరావు హోటల్లో 'ఒక అరకప్పు' కాఫీతాగి ఒంటిగంటకి యిల్లు చేరుకున్నాడు. "ఇదీ నాపండగ" అనుకుని.

అత్తగారు ఫలహారాలైనా తినమంది- కనీసం.

"ఎందుకండీ! ఈపాటికే కడుపునిండింది. ఆకలిలేదు" అన్నాడు లేనినవ్వు తెచ్చుకుని.

"హోటల్లోకూడా ఫలహారాలు చేస్తారా?" అంది ఆవిడ.

"అవునండీ !" అని తన గదిలోకి వెళ్లాడు. పొద్దున సుశీల పెట్టిన కాఫీ అలాగేవుంది. ఏదో దీపావళి సంచికలు తిరిగేస్తూ కుర్చీలో కూర్చొనుంది సుశీల. అతను మాట్లాడకుండా విశ్రాంతికని పడుకున్నాడు, వెనుదిరిగి కొన్ని క్షణాల తర్వాత సుశీలే నిశ్శబ్దాన్ని ఛేధించింది.

"ఒకసారి దొరగారు యిటు తిరుగుతారా?"

"ఏం?" అటు తిరిగాడు.

మొహంకేసి చూస్తూ, సుశీల అతనిపక్కలో కూచుంది.

"ఏం?" అన్నాడు మళ్లీ కొంచెం కఠినంగా!

"నేనేం పాపంచేశానని అంతకోపం? పండుగపూటాను?" అంది.

"పిల్చి మాట్లాడకపోతే?"

"నాపిచ్చి బాబులు తలదువ్వుకోలేదు. గడ్డం కూడా గీసుకోలేదు. ఎందుకు నామీద అంత కోపం ?"

"... ... ..."

"పండక్కి సరదాగా మావాళ్లు రమ్మన్నారనేనా? మిమ్మల్నీ రమ్మన్నారు; మీరు వొప్పుకోలేదు, నన్నూ మానమనీ అనలేదు" బుజ్జగించసాగింది.

"అవును నీకర్మమేం? నువ్వు మానడం ఎందుకు?"

"అదుగో – మళ్లీ అదేకోపం! మీకిష్టంలేదంటేనేనూ వెళ్ళకపోదును. అయినా మీనాన్న వాళ్ళు బతికివుంటే మీరు వాళ్ళని కాదని వుండగలుగుదురా? అలా చేయలేదనేనా నామీదకోపం"

అతని కిష్టంలేదని చెప్పడు. ఆవిడేమానాలి. అప్పుడే ఆవిడ ప్రేమ బయటపడుతుంది. అతను సంతోషిస్తాడు.

"నాకు నిద్దరోస్తోంది" అని మాటలు తెంచేడు. సుశీల ఇంకే మాట్లాడలేకపోయింది. కాని అతనికి నిద్దర్లేదు. అవే ఆలోచనలు! 'మీవాళ్ళని కాదని వుండగలుగుదురా?' అదీ ప్రశ్న! ఎంత ధైర్యం? ఒకభార్య ఒకభర్తని అలా ప్రశ్నించడమే? ఎంత దురహంకారం?

తర్వాత కొన్ని గంటలు నరకంలోలా గడిచాయి అతనికి. రాత్రి తొమ్మిదింటికి ఎవరితోనూ చెప్పకుండా గోదావరి గట్టుకు పోయాడు. ఊళ్లోని పండుగ హడావుడే మొదలైనవి అర్థంలేని అసంబంధమైన విషయాల్లా.

'దరోతీ'కి ఓరగా కట్టివున్న పడవలో పడుకున్నాడు. ఆకాశంలోకి ఎగిరే తారాజువ్వలూ, ఊళ్ళోని టపాకాయల చప్పుడూ వినపడుతూనే వున్నాయి. కాని అతనిలోకం వేరు; ఆలోచనలు వేరు!

"ఔను మధ్యాహ్నం అనుకున్నదే మంచిది" అంతటితో అన్ని సమస్యలకీ పరిష్కార మవుతుంది. ఈవేళ గ్రహించని వీళ్లు కొన్నిఏళ్ల తర్వాత పశ్చాత్తాప పడుతారు. అదే వాళ్ళకితగిన శాస్తి. జీవితంలో అనుభవించ వల్సిన వేమీలేవు నాకు" అనుకున్నాడు. అతనికి భార్గవి జ్ఞాపకానికి వచ్చాడు. "అత్తవారింట ఆరునెల్లవునికి" అనుకున్నాడు – కాని ఇతను రెండునెల్లే అక్కడ వున్నది.

రెండురోజుల్నించి భోజనం, నిద్ర లేని మూలాన నీరసంతో, చల్లని గాలివల్ల అప్రయత్నంగా నిద్రపోయాడు. రాత్రి రెండింటికి కెరటాలకి పడవతెగి గోదావరిలోకి పోయింది – గోదావరి మధ్యంలో ఏదో లంకకీ తగుల్కొని తిరగబడింది. నీళ్లకెరటాలు అతని లంకకు చేర్చాయి. వొళ్లుతెలియని నిద్రలోనూ, నీరసంతోనూ వున్న అతనికి ఈ ప్రమాదం స్పృహ తెప్పించింది.

ఆరున్నరకి బొబ్బరలంకనుంచి వచ్చేవాళ్లెవరో పడవలో వేసుకొచ్చారు. రేవులోవాళ్ళు చెప్పిన ఆనవాళ్ళతో వాళ్ల యింటికి చేర్చారు.

ఆపరిస్థితిలో అతన్ని చూచిన సుశీల తెగ యాడవసాగింది. డాక్టర్ల సహాయంతో తనకి కొద్ది గంటల్లో స్పృహ కలిగింది. పిచ్చిగా అందర్నీ చూడసాగాడు ఏదో కలకంటున్నట్టు.

"నాతప్పులు క్షమించాలి, నేను మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. మీయిష్టంలేనిపని చెయ్యను–మనం స్వతంత్రంగానే వుందాం" అని కంటతడి పెట్టుకుంది సుశీల.

"నీదేం తప్పులేదు సుశీ. చావుకన్నా – ప్రేమ బలమైంది! అందుకే నిన్ను మళ్లీ కల్సుకోగలిగాను" అన్నాడు మృత్యువును జయించిన మృత్యుంజయుడు.

*19.11.1950–ఆనందవాణి వారపత్రిక*